

'లల్లాదేవి'

# కృశాగౌతమి

''ఇది ఏమి విడ్డూరమే! కొడుకు పుట్టినాడంటే 'నాకు రాహుకాలమే సంప్రాప్తమయింది' అన్నాడట గౌతముడు. ఇదెక్కడా విన్నది కాదు. కన్నది లేదు.

పుత్ర జననం పండుగే అవుతుంది కాని, యువరాజు మాటలు వినేందుకు విడ్డూరంగా ఉన్నాయి'' అన్న దామె. పలుకుకోసం పెదవి విప్పుకున్నదో, లేదో పగడాలు జల్లున కురిశాయి.

పలువరుస పులు కడిగిన ముత్యాల సరంలా తళుకు లీనుతున్నాయి. కంటి నీలాలు కథలో, కవితలో, కమనీయ భావాలకు వర్ణాకృతులలో అప్పటున్నగా తరళాయితం అయినాయి.

పచ్చని లలాటం గోమేధికాలు చిత్రించిన అపూర్వ కళాకృతిలా ఉంది. ఆమె వేదికలా నుదుటి మధ్యలో తీర్చిన తిలకం మాణిక్యాలు రాసిపోసినట్లు కుసుమాలు విరబూసినట్లు గొలుపుతోంది.

చిక్కని చెక్కిళ్ళపై పచ్చని పుట్టుమచ్చ పతకంలో అమరించిన పచ్చలా ఒదిగిపోయింది.

నవరత్నాలు రాసిపోసినట్లున్న రూపసి ఆ యువతి! ఆమె పేరు కృశాగౌతమి.

ఆ మాటలు విన్న పరిచారిక బదులు చెప్పటం మరచి రూప యవ్వన విలాస భూషితమయిన ఆమెవంక రెప్పవేయటం మరచి చూడసాగింది.

''ఏమిటే ఆ చూపులు. నే నడిగిన దానికి బదులు చెప్పవా?'' చిరు దరహాసంతో హెచ్చరించిందామె.

పరిచారిక ఉలికిపడింది.

''అమ్మగారూ! విధాత ఎంత గొప్పవాడమ్మా! సృష్టికర్తను మించిన మహాశిల్పి ఎవరున్నారు. మీ అందచందాలను చూసినప్పుడు మహాశిల్పి అయిన సృష్టికర్త అభిరుచిని వేనోళ్ళ పొగడాలనిపిస్తుంది'' అన్నది పరిచారిక తన్మయురాలయి పోయి.

రవంత చిరుకోపం నటిస్తూ బొమముడిచి ఆల్చిప్పలవంటి రెప్పలు అల్లార్చి—''చాలించవే నీ పొగడ్తలు. నేను అడుగుతోంది నా అందం గురించి కాదు. శాక్యసింహుడయిన గౌతముని గురించి'' అన్న దామె. కంఠస్వరంలో రవంత కసురు కొరడా విదిలించినట్లుగా అనటంతో పరిచారిక దిగ్గున తెలివి తెచ్చుకుంది.

''గౌతముడా! ఏమి చెప్పను తల్లీ ఆ గౌతముని గురించి. అతడు జడుడో, తాత్వికుడో, శాపగ్రస్తుడయి శాక్యరాజు కడుపున పుట్టిన ఏ దివ్య పురుషుడో నా కయితే తెలియదు కాని చిత్రమయిన మనిషి. మాయాదేవి గర్భవాసాన జన్మించిన మహనీయుడు, ప్రజాపతిగా తన ఒడిలో ఎదిగిన పవిత్రుడు, శుద్ధోదన మహారాజు అపూర్వ సుందరతర శుద్ధాంతాలలో గడుపవలసినవాడు.


కోట వదలి తోటలవెంట తిరుగుతాడు. ఈమధ్య ఏమో చెప్పున్నడంట. రథ చోదకుడంట. అతడు విషాద పూర్ణమయిన దృశ్యాలను చూసి ఏవో వేదాంత ఘటనాలు బోధించినాడంట.

అప్పటినించి మరీ విడ్డూరమయిపోయినది ఈ గౌతముని ప్రవర్తన. ఎప్పుడూ ఎడతెగని ఆలోచన! ఎక్కడ కూర్చున్నా ఒకటే పరధ్యాన. నేలవిడిచి సాము చేస్తున్నవానిలా కన్పిస్తాడు తల్లీ!

అతని మాటలు విడ్డూరంగా కాక మరేలా ఉంటాయి'' అని మూతి విరిచింది పరిచారిక. ఆమె దృష్టిలో శాక్యసింహుడయిన గౌతముడు వెర్రివాడు.

తండ్రి శుద్ధోదనుడు సుందరతరమయిన ఆరామ సౌధాలను నిర్మించి ఇచ్చాడు. లాసికలను రప్పించాడు. నృత్య గాన విలాసాల మధ్య అతడు మైమరిచిపోవాలని ఆశించాడు.

లాలసా పూర్ణమయిన బ్రతుకు పట్ల గౌతమునికి వ్యామోహం కలగాలని ఎంతగానో ప్రయత్నించినాడు. కాని రాజు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయినాయి. గౌతముడు నిర్లిప్తుడుగానే మిగిలిపోయినాడు అతడు జన్మించిన ఏడవనాట తల్లి




మాయాదేవి మానవీయమైన పంచ భౌతిక శరీరాన్ని విడిచిపెట్టేసింది.

కన్నులైనా విప్పిచూడని పసిపాపడు కన్న తల్లిని కోల్పోయినాడు. కాని అతని పినతల్లి ప్రజాపతి గౌతమి కన్నతల్లిని మరిపించేలా బిడ్డను సాకింది. విధిచేసిన గాయం మానిపోయేలా మమతను, మమకారాన్ని బిడ్డయందు ఒలికించింది.

కాని గౌతముడు ఒంటరి అయినాడు. ఒంటరి తనాలు చేరుకునిన వయసులో ఒంటరిగా కూర్చుని ఆలోచించటం ప్రారంభించినాడు.

ఏ వయసుకా ముచ్చటలే కదా అందం.

అప్పుడప్పుడు హాలికోత్సవంలో జమ్మి చెట్టు నీడలో కూర్చొని ధ్యానసమాధిగలుడైనాడు. అది ఏమి విడ్డూరమో! వయసు నించి వనాలు!

అతడు ఇలాగే మరికొంతకాలం ఒంటరి తనాన్ని ఆశ్రయించుకుని ఉంటే ఉన్మాది కాగలడని భావించింది దాసి.

కాని పరిచారిక చెప్పిన మాటలు కృశాగౌతమి తల దూరలేదు. గౌతముని రూపం కనుల ముందు ప్రత్యక్షమయింది. నీలాల నింగిలో అగాధమయిన అర్థాలను అన్వేషించే కన్నులు— ఎంత సుదీర్ఘ మందరతర నయనాలవి!

ఆ కన్నులలో ఎంత ప్రశాంతి! ఎంత ప్రేమ

చెవి బుజాలమీదకి ఒదిగి వాలుతున్న విశాల మైన కర్ణపుటాలు. ఆనాడు మాయాదేవి కలలో కన్పించిన శ్వేత మాతంగం అతడే కాబోలు! ఎంతటి అదృష్టశాలిని అతడి అర్ధాంగి!

రుచిరమయిన తను కాంతి. పెదవి కదిపినాడో జలద గంభీర మధుమృదంగాలు రవలిస్తాయి.

ప్రశాంత విశాంత ఏకాంతాలలో విభ్రమ కౌగిలించుకున్నప్పుడు అతనికి వింజామర వీచే లాసిక ఎంత అదృష్టశాలిని!

అంతటి అదృష్టం తనకూ కావాలనిపిస్తుంది. కాని అది సాధ్యమా? శాక్యసింహు డతడు. సాధారణ రాజబంధువు తాను. రమ్యమయిన రంగ స్థలిపైకి పిలిచేందుకు అతడు నటుడయినా కాడు. కౌగిళ్ళలో కరిగించేందుకు విటుడయినా కాడు. లంపటుడు కాడు. కేవలము ఏకాంత లాలసుడు.

కృశాగౌతమి తరచి తరచి ఆలోచించుకుని అతడు తన చేరువకు వచ్చే అవకాశాలు లేవే లేవన్న నిర్ణయానికి వచ్చింది. బ్రతుకు వృధా అనిపించింది. కనులు ఆర్ద్రమయినాయి. చిక్కని చెక్కిళ్ళు కన్నీటితో తడిసి చిత్తడి అయినాయి. తన యజమానురాలి ధోరణిని గమనించిన పరిచారిక కలవరపాటుతో కదిలిపోయింది. గౌతముని కొంచెపరచి తానాడిన మాటలకు ఆమె మనసు నొచ్చుకున్న దేమో! అనుకున్న దామె.

ఈ ఆలోచనతో కలవరపాటు మరింత కూడ అయింది.

"అమ్మా! ఈ మందబుద్ధిని మన్నించు, తల్లీ! నా తెలివి తక్కువతనంవల్లనే నాకు అలా అనిపించింది. కాని అతడు శాపగ్రస్తుడై మానవాకృతి దాల్చిన ఏవరో మహాపురుషుడయి ఉంటాడు. లేకున్న ఆ మనోవృత్తి ఏమి? లోకబాంధవుడయిన రవి కిరణాలను నిరోధించేదికదా రాహులము. పుత్రోదయాన్ని రాహులముగా భావించినాడంటే అతడెంత విరక్తుడు అను కోవాలి.

అంతటి విరక్తి సాధారణ మానవమాత్రులకు సాధ్యమా, తల్లీ! ఆ మాయదారి రథచోదకుడు చన్నుడే యువరాజు మనసుని విరిచినాడు. దర్ప ణంలో చొరబడిన రవికిరణం చిన్నదే అయినా ప్రతిఫలించినప్పుడు అది కనులు మిరుమిట్లు గొలుపుతుందికదా! చీకటిని తొలగించలేని చిరు దీప కాంతులు మణులలో ప్రతిఫలించి మణిదీపా లవుతాయి. అలాగే, తల్లీ.

అతడు మహనీయుడు. చన్నుడు నిమిత్తంగా ఏవో కొన్ని సర్వసాధారణమయిన సంఘటనలు అతని మనసుని తాకినాయి. సహజ సంస్కారం కలిగినవాడు కావటంవల్ల గౌతముడు చావు పుట్టుకల మధ్య నడిచే ఈ అల్ప జీవితాలకు అర్థాలను ఆలోచించటం ప్రారంభించినాడు.

నావంటి పామరులలో, జడులలో అనుభవాలు నాటుకొనవుకదా! మావంటివారి మనసుని తాకిన అనుభవాలు శిలాఫలకాలన్ని తాకిన చంద్రకిరణాలా నిరర్థకమవుతాయి. ఈ సృష్టిలో ఎందరెందరో ఎన్నెన్ని చావులు చూడలేదు. ఎందరెందరు జరాగ్రస్తులనూ, రుజాగ్రస్తులనూ చూడలేదు? అనునిత్యమూ మనము ఎందరు విరాగులను చూస్తున్నాముకాము? మనమంతా గౌతముని వలె ఆలోచించగలమా? అదేదో పూర్వజన్మ సుకృతం, తల్లీ! అతడు మహనీయుడే!" అంటూ తన వాదనని తానే తిల్లక్రిందులు చేసి అన్న గించింది పరిచారిక. దాని అదురుపాటుకు లోలోన నవ్వుకుంది కృశాగౌతమి.

"ఏమి నీ వాచాలత్వము. ఇప్పుడు ని న్నేమన్నాను? గౌతముని సంగతి నాకు తెలియదా? తన వారిని ప్రేమిస్తే అది అనురక్తి అవుతుంది. విశ్వాన్ని ప్రేమించగలిగితే అది విరక్తి అవుతుంది. అతడు సమర్థుడై ప్రాణులన్నింటినీ సమంగా ప్రేమించగల మహనీయుడు. కరుణ అతని ప్రకృతి.

క్షమ మాత్రమే ప్రతికృతి! మహాత్ములకు మాత్రమే సాధ్యమయిన విశ్వప్రేమను అతడు అవలీలగా నేర్చినాడు. ఎప్పుడయిన ఈ వంకకు వచ్చునా? మనకు దర్శనమిచ్చునా?" అప్పుడి కృశాగౌతమి వివశురాలయిపోయి.

పరిచారిక పెదవులు దాటని విధంగా నవ్వు కుంది. అమ్మగారి ఆత్మాశ ఆమెకు అబ్బురమే అనిపించింది.

"మీ కెందుకు వచ్చింది తల్లీ ఈ ఆలోచన. పటజంగమువలె పవిత్రమూర్తి అతడు. ఈ విట వాటికకు వచ్చునా! మనకు దర్శన మిచ్చునా? ఈ ఆలోచన కథ కాదు. కల కూడ కాదు. కల్ల మాత్రమే!" అంటూ నిస్పృహగా బదులు చెప్పింది పరిచారిక.

ఉస్సురని నిట్టూర్చింది కృశా గౌతమి.

ఆమె కూడా శాక్యుల ఇంటి ఆడపడుచు. రాజ బంధువేకాని, బహు దూరపు బాంధవ్య మది. వారూ, వీరూ శాక్యులే అయినా బ్రతుకు దారులు వేరయి నాయి.

మనసులన్నీ ఒకలా ఆలోచించవు. మనుషులంతా ఒకలా జీవించరు. కొండ దిగి ఉరుకుతున్న సెలయేరు ల్లాంటివే కదా బంధుత్వాలంటే? వాటి దారిన అవి పోతాయి. ఎక్కడో కలుస్తాయి. ఎక్కడో విడి పోతాయి. గౌతముడే కదలి వచ్చి కళ్ళెదుట నిలిచినా ఏ బంధుత్వాలను గుర్తు చేయాలి? అని ప్రశ్నించు కుంది కృశాగౌతమి.

అతడు పరిపూర్ణుడయిన పురుషుడు. మహా మానవుడు. తాను సాధారణ మానవి! అంతకు మించిన బంధుత్వా లేమున్నాయి అని సమాధానం చెప్పుకుంది.

అందాకా తీరికగా కూర్చుని ఉబుసుపోక వ్యసనంగా లను పల్లించిన పరిచారిక ఛప్ లేచింది.

ఈ యజమానురాలి చాదస్తపు ఆలోచనలు ఈడేరునని కావుకదా అని మనసులోనే అనుకుంది.

"అమ్మా! రాజవాసంలో పనికుండా కేరింతలున్నాయి. పుర జనుల ముఖములు పురి విప్పి నాట్యం చేస్తున్నాయి. రేపటి నుంచి ఉత్సవాలు జరుగుతాయని చెప్పు కుంటున్నారు. ఎప్పుడో పోయిన కోత్సవం నాడు పుట్టినింటికి పోయి వచ్చాను. మీ అనుమతి లభిస్తే ఈ ఉత్సవాలు కూడా అక్కడే జరుపుకుంటాను తల్లీ!" అన్నది అంజలి ఘటించి.

కృశాగౌతమి ఇంకా గౌతముని జ్ఞాపకాలనుంచి పరాకువిండి బయట పడనే లేదు. 'ఊ' అన్నదామె.


పరిచారిక వందనాలు చెప్పి వెళ్ళిపోయింది.

ఏకాంతం ఆమెకు కల్పించిన అవకాశాన్ని ఆధారం చేసుకుని పూర్తిగా ఆలోచనలకు అంకితమైపోయి తల్లీనురాలయింది కృశాగౌతమి.

• • • •

కపిలవాస్తు పురంలో శాక్యులంతా ఉల్లసించి నారు.

'శాక్యసింహుడయిన గౌతమునికి యశోధర యందు మగశిశువు ఉదయించినాడంట. అతడు




తండ్రిని మించిన, తల్లిని మించిన తనూ సౌందర్య శోభలను వెలార్చుతున్నాడట.

రండి రండి! పండుగలు చేసికోండి. వేడుకలు చూసేందుకు గౌతముడు కూడ తరలివస్తున్నాడు, అని చెప్పుకోవడం ప్రారంభించారు.

ఉత్సవాలు ఆరంభమయినాయి.

విచ్చిన పూగుత్తులతో పచ్చాకు తోరణాలు కట్టుకున్నారు. నిమాత్న వస్త్రాలకు చిరునవ్వు అలంకారాలు జోడించి యువతీ యువకులంతా బిలబిలమంటూ వచ్చేశారు.

మిత్రరాజ్యాలయిన కోసల, మగధ, సాకేత, శ్రావస్తి, వైశాలి నించి ప్రతినిధులు వచ్చారు, వారందరికీ రాజోచితమయిన మర్యాదలు చేయించాడు శుద్ధోదన మహారాజు. కస్తూరికా పరిమళాలు కపిలవాస్తు పురవీధుల్లో మత్తెక్కించినాయి. మంగళ వాద్యాల్ని, వేద మంత్రాలు శాక్య నగర విహాయస వీధుల్లో నినదించినాయి.

తండ్రి పంపిన సందేశాన్ని గౌరవించి గౌతముడు కూడ ఉత్సవాలలో పాల్గొనేందుకు విచ్చేశాడు.

పండుగ అంతా అతనిదే కావలసింది. విరక్తుడయి, నిర్లిప్తుడయి కన్పించాడు గౌతముడు.

ఛన్నునితో కలిసి విహారానికి పోవాలని పయన మయిన అతనికి ఎదురు వచ్చిన దృశ్యాలు ఇంకా కనుల ముందు కదులాడుతున్నాయి.

సన్యాసులలో మహనీయుడయిన అతని మాటలు మనోఫలకం మీద నిలిచి ఇంకా చెదిరి పోలేదు.

"గౌతమా! చావు పుట్టుకల మధ్య చిన్న ప్రయాణమే కదయ్యా బ్రతుకంటే! పుట్టుక అనేది ఒక ప్రమాదం. మరణమనేది అనివార్యం. రోగమూ, వృద్ధాప్యమూ నీవు నివారించలేని అనివార్య పరిణామాలు. ఇంక మనిషిచేతిలో మిగిలి ఉన్నదేమి శూన్యం తప్ప! ఈ శూన్యంలో స్వార్థమనే పెనుభూతాన్ని సృష్టించుకుని అది చెప్పినట్టల్లా పరుగులుతీస్తాడు పిచ్చి మానవుడు.

స్వార్థానికి ఫలితాంశమే కోరికలు. లాలసా పూర్ణమయిన జీవితం అసంతృప్తిని మాత్రమే మిగుల్చ గలదు. క్షమ, కరుణ, దయ పూర్ణమయిన బ్రతుకులో పరిపూర్ణమయిన అర్థాలను కల్పించుతాయి. తీర్చుకోవటం ద్వారా కోరికలు పెరుగుతాయే కాని తరగవు. తృప్తిని సాధించిన మనిషి సృష్టిని జయించిన వాడితో సముడు. హింస ద్వారా ఎదుటి వారిని జయించలేము. అహింస అక్షౌహిణుల సైన్యంకన్నా బలీయమయినది.

త్యాగభావంతో అన్వేషణకు పూనుకున్న వారికే వెలుగుదారులు దర్శన మిస్తాయి. అండంలోని జీవిని పెంకు కప్పివేసినట్లుగా మానవ ప్రాణిని స్వార్థమనే భ్రాంతి కప్పివేసింది.

దానిని పగుల గొట్టిన వారికే విముక్తి" అని చెప్పేడు చన్నుడు.

ఆ మాటలే గౌతముని మనసుని మళ్ళీ మళ్ళీ పట్టి లాగుతున్నాయి. అతడు చెప్పిన అనుభవాలతో తనకు తెలిసిన దాన్ని జోడించి ఆలోచించాడు గౌతముడు.

తానొక పంజరంలో బంధించబడిన పక్షిలాగ ఉన్నాడని అతనికి అర్థమయింది. ఆ పంజరం నించి బయట పడేందుకు దారులేమిటా అన్న ప్రశ్న విశ్వ రూపంలో అతనికి దర్శన మిస్తోంది.

ఆలోచనల మధ్య గౌతముడు అహర్నిశలు, అనుక్షణం తనను తాను మరిచి పోతున్నాడు.

తండ్రి ఇచ్చిన సందేశంమేరకు ఉత్సవాలలో పాల్గొనేందుకు వచ్చాడు. కాని తామరాకుపై నీటి బొట్టు లాగే ఉండిపోయినాడు. శాక్యనాగరికుల ఆశాకిరణమయి జన్మించిన రాహుల కుమారుని అందచందాల గురించిన చర్చలే జరుగుతున్నాయి.

కాని సిద్ధార్థుడు సృష్టి వికాసం గురించి ఆలోచించ సాగినాడు. ఒకనాడు ముగ్ధలా తన చేయి పట్టుకుని వెంట వచ్చిన శాక్యసుప్రబుద్ధుని కుమారి, దేవదత్తుని సోదరి అయిన యశోధర అతని మనోఫలకం మీద ప్రత్యక్షమయింది. ఆమె అందాల రాశి. సుకుమారి. బద్ధకచ్చాన (భద్రకాత్యాయని యశోధరకు మరొక పేరు) ఇప్పుడు ఆలనాటి ముగ్ధ కాదు. మాతృ మూర్తి అయింది.

ఆమెతో పెంచుకున్న అనుబంధమే కదా ఈ బంధానికి కారణం అని సంభావించినాడు సిద్ధార్థుడు.

సాకేత, శ్రావస్తి, వైశాలి వంటి మిత్ర రాజ్యాల నించి వచ్చిన ప్రతినిధులు అందించిన కానుకలను కామనలకు అతీతుడయి అందుకున్నాడు. పరిచారికులకు అందించినాడు.

వేడుకలలో పాల్గొంటున్న శాక్య జనసందోహాలను చూచి అతని అంతరంగం కరుణ సముద్రమై పొంగినది. వారి ముఖాలలో కనిపించే ఆనంద లాస్యాల వెనుక దాగివున్న జర, రుజలను అతడూహించినాడు. సంతోష వార్నిధుల వలె కనిపిస్తున్న వారి సిగలో పొంచి ఉన్న మృత్యురూపం అతనికి దర్శనమిచ్చింది.

అయ్యో! ఎంత అమాయకులు వీరు. ఎప్పుడో ఒకప్పుడు సంప్రాప్తం కానున్న వృద్ధాప్యం గురించి రవంత అయినా ఆలోచించరేమి? అనివార్యంగా కౌగిలించుకుని తనలో ఇముడ్చుకునేందుకు పొంచి ఉన్న మృత్యువు గురించి సభావించ రేమి?

వీరంతా పొంచి ఉన్న ప్రమాదాల గురించి ఆలోచించటం మరిచి కేవలం తాత్కాలిక మయిన అణుమాత్రపు ఆనంద ప్రాప్తికే తన్మయులయినా రేమి?

వీరికి వాస్తవమయిన దృష్టి కలిగేది ఎన్నటికో కదా! అనుకున్నాడు. ఇంక అతనికి ఆ శాక్య జన సందోహాల మధ్య ఉండాలనిపించలేదు. గృహోన్ముఖుడయినాడు.

నగరికయినా పోవాలనిపించ లేదు. కాలికి వచ్చిన దారి వెంట నడువ సాగాడు. ఆనంద సందోహం మధ్య మునిగి తేలుతున్న అనుచరు లందరికీ సిద్ధార్థుడేమయినాడన్న మీమాంస తల ఎత్తే సరికే అతడా ప్రాంతాలను విడిచి పోయినాడు.

పరిత్యజించగా మిగిలిన కొద్ది పాటి రాచరికపు చిన్నెలు చూచి కొందరాతడెవరో గుర్తించి నారు. కొందరు గుర్తించ లేదు. గుర్తించిన వారు గౌరవ సూచనలు అందించారు. గుర్తించని వారు తలలు దించుకుని తప్పుకు పోయినారు.

వారాదరించినారో, అనాదరించినారో గ్రహించ గల స్థితిలో లేడు సిద్ధార్థుడు.

చింతా సముద్రుని వలె సాగిపోతున్నాడు. తను విశ్వసించి, బ్రతుకుపైని ఆశలతో, కలలతో తన వారందరిని వదిలి వచ్చిన దామె. ఈనాడు విరక్తుడయిన భర్తను తలచి దుఃఖిత అవుతున్నది.

రాహులమాత గురించి కరుణాంత రంగుడయి కదిలిపోతున్నాడు. మరి కొంత దూరం పోయాక ఒక్క బద్ధ కచ్చాన ( భద్రకాత్యాయని ) ఏమి? ఈ మానవులందరు ఎట్లున్నారు.

బ్రతుకు గమ్యాలు అగమ్యమయిపోయినవి కదా! దారి తెలియక దురపిల్లుతున్న సర్వ మానవజాతి దుఃఖానికి నివారణోపాయం ఆలోచింప గలిగిన ప్పుడే కదా విముక్తి?

సకల మానవాళి అనుభవించే మహా ఘోర దుఃఖంలో యశోధర అయిన బద్ధకచ్చాన అనుభవించే దుఃఖం అంతర్భాగ మాత్రమే! ఆ మహా దుఃఖానికి తరుణోపాయం అందింప గలిగితే రాహుల మాత దుఃఖంకూడా శాంతి మవుతుంది.

అన్వేషణ మార్గంలో పురోగమించేందుకు తాను ఆమెను వదిలి పోవాలి. అలా పోక లాలసా పూర్ణమయిన ఈ రాచరికపు లంపటాలలో ఇమిడి ఉండి పోయినప్పటికీ ఆమెకు దుఃఖనివృత్తిని కానేరదు కదా!

కోరికలు దుఃఖానికి మూలకారణ మయినప్పుడు కోరికలను పరిత్యజింపనిదే దుఃఖశాంతి లభించదు. కావున అన్నింటిని జయించిన నాడు భర్త ఎవరు? భార్య ఎవరు?

ఇంక దుఃఖమునకు ఆలంబన ఎక్కడ? అని ఆలోచించినాడు శాక్యసింహుడు.

తాను పరిత్యజించినా, పరిత్యజించక పోయినా కామనలను విడువనిదే రాహుల మాత కయిన దుఃఖం అనివార్యం అన్న నిర్ణయానికి వచ్చేశాడు.

మనసు రవంత పూలదిల్లినట్లు అయింది..

అప్పటికి రవంత పొద్దు పోయింది. వీటవాటికలలో జనసంకీర్ణత ఆరంభమయింది. చీకటి తెరల మాటున కనిపించే మానవాకృతులు నీడల వలె అయినాయి.

భూమిని ముద్దాడుతున్న మృదుల మయిన పాదాలు ముందుకు సాగుతున్నాయి. కుమారుడయిన రాహులుని, రాహులమాతని విడిచి పుచ్చటం ప్రత్యేక మయిన దుఃఖ కారణం కాదన్న నిర్ణయానికి వచ్చాక అతనికి శాంతి లభించింది.

తానిప్పుడు పూర్తి స్వేచ్ఛాజీవిలా తనకే అనిపించ సాగింది. తను అన్వేషణలో అడవిదారుల వెంట పురోగమించేందుకు ఎదురయిన అభ్యంతరాలన్నీ తొలిగినట్లు అయింది.

గుండె నిండుగా ఊపిరి పీల్చి స్వాంతు డయినాడు.

తక్షణమే రాచనగరుకు తిరిగి పోవాలన్న కోర్కె బలీయమయింది. తన దారిలో తాను పోయే ముందు చిన్న విడిది లాంటి రాచనగరులో కొద్ది క్షణాలు గడపాలనిపించింది. వెనుతిరిగి పోవాలన్న ప్రయత్నంలో తాను ఎన్నడూ ప్రవేశించని ఒక వీధిని ప్రవేశించినాడు గౌతముడు.

ఆ వీధి చాలా జనసంకీర్ణంగా ఉంది.

వేశ్యాకాంతల పొందు కోరి అలంకృత విభూషణులతో విచ్చేసిన విటులు అందందు తచ్చాడుతున్నారు.

వారిని తప్పుకుని తన దారిన పోతున్నాడు గౌతముడు.

ఒక వాకిట అరుగులపై చిరు చిరునవ్వుల మువ్వడులు అతనికి వినిపించినాయి. ముంగిటిలో ఒక ముగ్ధ కనిపించింది.

ఆమె పెదవులు పగడాల కాంతులీనుతున్నాయి. కమల నేత్రాలు. పచ్చని మేడురు. గోమేధికాలతో చిత్రించిన రమ్యమయిన ఆకృతి. పలువరుస పురు కడిగిన ముత్యాల బారు.

ఆమె అందచందాలు నవరత్నాలు రాసిపోసినట్లు రాజిల్లింది. నన్ను సకల కళలతో అలంకరించ వచ్చే లాసి కలలో ఈ పాట అందచందా లున్న వా రెవరున్నారు అని భావించినాడు సిద్ధార్థుడు.

"అందగాడా ఆగవోయీ!" అన్నదామె. కంఠస్వరం కమనీయం! గౌతముని పురోగతికి ఆ మాటలు ప్రతిబంధకా లయినాయి.

పద్యార్థాన్ని ఓంకే అన్వయించేందుకు గౌతముడు మధురమయిన మందస్మితం చేశాడు.


లౌకిక విభవం కన్నా ఈ వైభవం ఉన్నత మయినది అని సంభావించినాడు. ఆ ముగ్ధను కరుణించినాడు.

కంఠాభరణమయిన ముత్యాల సరాన్ని ముడిని అందుకోమని ఆమెకు అందించినాడు.

ఆమె ఆ ముత్యాల సరాన్ని అందుకో లేదు.

"అందగాడా! సంపన్నుడ నని చాటుకుంటు న్నావా? హంస రెక్కలు అల్లార్చక పోయినా వాటి ధావళ్యాన్ని పూహించలేని చూపరు లెవరుంటారు? యువరాజా అందునావగాయూదేవి గర్భవాసాన జన్మించి ప్రజాపతి గౌతమి ఒడిలో పెరిగిన అదృష్టశాలి భాగ్యశాలి అని చెప్పుకోవలెనా?" అన్నదామె ముత్యాల సరాన్ని ముట్టకనే.

'ఓహో! నే నెవరో ఈమెకు తెలుసు కాబోలు' అని భావించి గౌతముడు మరల మందస్మితం చేసినాడు.



రవంత సంశయిస్తూ నిలిచి పోయినాడు.

శ్రావ్యమయిన, కర్ణపేశలమయిన స్వరంతో ఆమె ఒక పద్య పాదాన్ని అందుకుంది.

నిర్వృత నూనసపితా ఆ తండ్రి అదృష్టశాలి అన్నదామె. అది పద్యంలోని ప్రథమ పాదం. గౌతముడు నిరుత్తరుడయి నిలిచి పోయినాడు. ఆ కంఠ మాధుర్యం వల్లనో, భావగాంభీర్యం వల్లనో మిగిలిన మూడు పాదాలుకూడా వినాలని అనిపించింది.

ఆశగా ఎదురు చూచినాడు గౌతముడు.

నిబ్బూత నూనసమాతా అన్నదామె. అది రెండవ పాదం. ఆ తల్లి అదృష్టరాలని అన్నది.

గౌతముడు చిరునవ్వు నవ్వినాడు.

నిబ్బూత నూనసనారీ. ఆ భార్యది అదృష్టమే కదా! మూడవ పాదం విన్నాక గౌతముడు ఒక అడుగు ముందుకు వేశాడు. కన్నతల్లిని, తండ్రిని, కట్టుకున్న భార్యను అదృష్టవంతులుగా మార్చిన ఆ భాగ్యశాలి ఎవరో తెలియాలి కదా!

యస్యయన ఇది పతి ఈయవంటి వాడు భర్త కాగలిగితే! అంటూ నాలుగవ పాదాన్ని పూరించిందామె.

"నిర్వికారమయిన దానవే, వనితా! గౌతముని మనస్సుని అలరించినావు. కానుక అందీయ వస్తే కాదంటున్నావు. నీ పేరయినా చెప్పు జ్ఞాపకం పెట్టుకుంటాను" అన్నాడు గౌతముడు.

ఆమె పకాలున నవ్వింది.

"కమ్మని కవిత్వ రసాన్ని గ్రోలిన వాడవు.కానుక అందీయ సంకల్పించిన వాడు గడపదాటి రాలేదేమి. నా పేరు వినేందు కయినా లోపలకు రావోయీ!" అన్న దామె.

గౌతముడు గడప లోపల కాలు పెట్టినాడు.

ఆమె ఆంతర్యం ఆనంద కేదార మయింది. ఆమె మనసు విచ్చిన మందార మయింది. ఎన్నెన్ని నాళ్ళకు ఈడేరినాయి తన కోరికలు అని పొంగి పోయిన దామె.

అతని పవిత్ర పాదాలను కడిగి, పయ్యెదతో తడియార్చి పారతు తిచ్చి, పూయులపై ఉపవిష్టుని కావించింది.

"నా చొరవను మన్నించవోయీ! నాకు తెలుసు నీవు మహాపురుషుడవని. కారణజన్ముడవని. ఈ పేద రాలి ఇల్లు పావనం చేయగలవని ఆశతో ఎదురు

చూశాను.

ఇన్నినాళ్ళకు దర్శన మిచ్చినావు.

ఈ నిరుపేద వాకిళ్ళు నీ మృదుల పాదాల పవిత్ర స్పర్శతో నేటికి పునీత మయినాయి. అదృష్టవంతు రాలను కదా!

నాయనా! నా పేరు కృశా గౌతమి. శాక్య క్షత్రి యుని తనూభవను కావటం వల్ల నీకు దూరపు బంధుగురాలను.

అన్నింటిని మించి నీ రాకకై వాకిళ్ళు తెరచి వేచి ఉన్నదానను" అన్న దామె వివశమయి పోతున్న కంఠస్వరాన.

గౌతముడు ఆమె ప్రేమ ఆదర ఆతిథ్యాలకు పరవశు డయినాడు.

"కిస గౌతమీ! ఈ గౌతముడు ఎంత అదృష్ట శాలి! ఇంతటి ప్రేమ ఆదరాలను స్వీకరించేందుకు ఈతని అర్హత ఏమి? నేను నీ కెప్పుడు మేలు చేసిన జ్ఞాపకం లేదు" అన్నాడు కృశా గౌతమిని ఉద్దేశించి.

"సిద్ధార్థుడా! ఒక స్త్రీ నిన్ను ఆజన్మాంతం ఆరాధించేందుకు నీ ఒక్క మధుర దరహాసం చాలు నాయనా! ఈ నిరుపేద వాకిళ్ళు త్రొక్కి నేటికి బ్రతుకుని ఆశా పూర్ణం చేసినావు" అన్న దామె అతని పాదాలకు నుదురు తాకించి.

"కిసగౌతమీ! ప్రేమించి ఆదరించే అద్భుత మయిన స్త్రీత్వం నీకు ఉంటే ఉండవచ్చు. కాని దాన్ని స్వీకరించేందుకు ఈ గౌతముడు అనర్హుడు. ఎందుకంటే ఈ గౌతముని మనోమయ ప్రపంచం ఇప్పటికే విరక్తిలో నిండిపోయి ఉంది.

భార్యాసుతులను సైతం విడిచిపోవా లనుకుం టున్నాను. అన్వేషణ మార్గంలో మహాప్రస్థానం చేయా లనుకుంటున్నాను. మనసు డోలా లోలిత మయింది.

కానున్న మీ యువరాజు ఈ పాటికే అడవి దారులు పట్టిపోయి ఉండేవాడు. నీ అమృతగానంతో నన్ను అలరించినావు. ఈ ముత్యాల సరాన్ని స్వీకరించి నన్ను ఋణవిముక్తుని చెయ్యి" అని అర్థించి నాడు గౌతముడు.

కాదనలేక ముత్యాల హారాన్ని అందుకుంది కృశా గౌతమి.

"కిసగౌతమీ! మహాత్వ పూర్ణమయిన బ్రతు కులో దుఃఖానికి మూలకారణం, దానికి నివారణో పాయం అన్వేషించాలని సంకల్పించాను. కాని రాహుల మాత నా మనసును ఇంకా శృంఖలాబద్ధం చేస్తోంది" అన్నాడు గౌతముడు బాధగా!

అతడు కారణ జన్ముడయిన మహా పురుషుడు. కేవలం ఒక స్త్రీ ఆకర్షణ కారణంగా అతడి మనసు డోలాందోళితం కారాదు. గౌతము డంతటి బల హీనుడు కాకపోయినప్పటికీ కొంత చెప్పటం తన కర్తవ్యంగా భావించింది కృశా గౌతమి.

"గౌతమా! ఒక్క రాహుల మాత ప్రయో గించిన సమ్మోహన శక్తిని ఛేదించలేని వాడవు మనుషులకు సైతం అర్థం కాని దుఃఖకారణాన్ని ఎలా అన్వేషిస్తావయ్యా!

మానవ శరీరమంటే రక్త మాంసాల ప్రోవు అని నీకు తెలియదా! ఆ శరీరంలో అంతర్లీనమై ఉండే మనసు కోరికలకు మరో రూపం.

ప్రియతముడా! నాయన గౌతముడా! స్త్రీ అంటే ఏమిటో నీకు తెలియునా?" అని అడిగిం దామె.

సిద్ధార్థుడు అర్ధ నిమీలితు డయినాడు. ఆలోచనా తరంగాల వల్ల కల్లోలిత మయిన అంతరంగుడు అయినాడు. నిశాల సుందరమయిన కనులపై రెప్పలు అల్లన వ్రాలినాయి.

"కిసగౌతమీ! అట్లడిగినా వేమి? నన్ను కన్న మాయాదేవిని, ఒడినెత్తి పెంచిన ప్రజాపతి గౌతమిని అర్ధాంగి అయిన రాహులమాతను, ఎందరో లాసి కలను మరచినాను అనుకున్నావా?" అన్నాడు మంద స్వరాన.

కృశాగౌతమి తల అడ్డంగా వూగించింది.

"లేదయ్యా! వారెవ్వరూ స్త్రీని గురించి నీకు అర్థమయేలా చెప్పలేదనుకుంటాను. అలా చెప్పక పోవటానికి కారణం నీవు యథార్థాన్ని గ్రహించ విరక్తుడవు అయితే వారి స్వార్థాలు దెబ్బతింటాయి. నీ దర్శనా కాంక్షతో పరితపించిన ఈ నిరుపేదరాలు ఆ వాస్తవాన్ని విప్పిచెప్పేందుకు సంసిద్ధురాలు" అంటూ అతని పాదాల ముందు వ్రాలిపోయింది కృశాగౌతమి.

"కిస గౌతమీ! నీవేమి చెప్పదలిచేనావో చెప్పు. అభ్యంతరా లనే తెరల మాటున వారు దాచిన వాస్తవ రూపాన్ని నీవు వివరించ గలవా?" అని అడిగాడు గౌతముడు.

అతడలా అడుగటంతో ఉద్విగ్నురా లయింది కృశాగౌతమి. వెంటనే ఆమె తన తనువల్లరిని పరివే ష్టించిన వలువ లన్నింటినీ వూడ్చి తల్లి గర్భంనుంచి తరలి వచ్చిన దానిలా నిలిచింది.

'చూడనాయనా పురుషుడా! అందచందా లనగా రక్తమాంసాల అమరికలు. ఈ రక్తమాంసాల వెనుక దాగి ఉన్న ఎముకల గూడును ఒక్కసారి నీ కనుల ముందు ప్రత్యక్షం కావించు.

మృత్యువు కౌగిళ్ళలో పిడికెడు బూడిదగా మిగిలి పోయేదే కదా ఈ శరీరం. కరిగిపోయే యవ్వనం ఒక భ్రాంతిలా ఆవరించిన ఈ శరీరాన్ని చూడు.

యవ్వనపు పొంగులో ఒద్దారిన ఈ చిక్కని చెక్కిళ్ళు జరాపీడిత మయి ముడతలు పడుతాయి. తరళాయితమయిన ఈ కనుల సోయగాలు అంత రించి గాజు పెంకుల్లాగు మిగులుతాయి. తను కాంతి యావత్తూ తరగిపోయి నిస్తేజ మవుతుంది. మగ వానికి మత్తెక్కించి సమ్మోహన పరిచే స్త్రీ భవుతి శరీరపు నిజ స్వరూపం ఇదోయీ!

ఇంక అంతరిక లోకాలంటావా? అవన్నీ కామనక లతో నిండి కలుషిత మయి ఉంటాయి. పవిత్ర మాతృమూర్తి మాయాదేవి అయినా, ప్రజాపతి గౌతమి అయినా, బద్ధకచ్చాన అయినా ఆమె ఒక స్త్రీ!

ఆ స్త్రీ శరీరం తలూకు యదార్థ రూప మింతేనోయీ!


నీవు జడుడవు కావు. నిూదుమిక్కిలి చైతన్య స్వరూపుడవు. ఈ వాస్తవాన్ని నీ గవేషణలో ఎలా అన్వయించుకో గలవో ఇక ముందు చూస్తాను" అంటూ ఆ చోటు వదలి అభ్యంతరాల అవతల వెళ్ళి పోయింది కృశాగౌతమి.

ఆమె తిరిగి వచ్చే వేళకు గౌతము డక్కడలేడు. ఏలువరసరాలా తరణించే పులు కడిగిన ముత్యాల సరం అతని జ్ఞాపకంగా పూయులపై మిగిలి ఉంది.

కరుణా సముద్రు డయిన ఆ మహనీయుని మధుర జ్ఞాపకాలను మనసులో దాచుకుని అహర్నిశ్శి మెడలో ధరించింది కృశాగౌతమి.

సిద్ధార్థుడు అభ్యంతరాలన్నింటినీ దాటి అంతః పురాన్ని చేరుకున్నాడు. భారత ఇతిహాస పుటల్లో ఒక అద్భుత మయిన కథగా, భారతీయుల భూ దయను భావి తరాలకు చాటి చెప్పేందుకు సాంస్కృ తిక గిరి శిఖరాలపై రెపరెపలాడే మహోజ్వల కేత నంగా నిలిచిపోయిన మహాప్రస్థానం ఆ రాత్రికి రాత్రే జరిగిపోయింది.

కన్నవారిని మరచి, కన్న బిడ్డను మరచి, కట్టు కున్న దానిని మరచి, తన శరీర స్థితిని తానే మరచి నిద్రించే బద్దకచ్చానను తిలకించినాడు గౌతముడు.



ఈమె కీ నిద్రావస్థలో అన్నీ మరచి ఆద మరచిన స్థితిలో ఎవ్వరే మవుతారు అని ప్రశ్నించుకున్నాడు.

వయసు వగలు కురిపించేలా సికలు అస్తవ్యస్త మయిన ముద్రలతో నిద్రిస్తున్నారు.

చిన్ని నిద్రకే తెగిపోయే బంధాలు మృత్యువులో ఏమవుతాయి అని ప్రశ్నించుకున్నాడు.

అన్నింటిని పరిత్యజించి పరివ్రాజకుడయి మహా పరి నిర్వాణం చేశాడు. అన్నింటినీ వదలి అగాధ మయిన చీకటి దారుల వెంట తరలిపోతూ అను కున్నాడు గౌతముడు.

"కిసగౌతమీ! సత్య దర్శనం చేయించిన నీకు ఈ గౌతముడు సర్వదా కృతజ్ఞుడు. ఈ సిద్ధార్థుడు బుద్ధుడు కాగలిగితే వెన్నుతట్టి వాస్తవాన్ని బోధించిన నీ చరిత్ర అమర మవుతుంది. చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది" అని సంభావించినాడు.

అతని ఆలోచనా తరంగాలు ఆమెను చేరినాయో, లేదో కాని ఆక్షణమాత్రం తన నిరుపేద గృహంలో అస్తవ్యస్తంగానే పడి ఆదమరచి నిద్రపోతున్నది.

నిద్రలోనే తాను ఆరాధించే గౌతముని జ్ఞాపకా లను కౌగలించుకుని ముద్దాడు కుంటున్నదికిసగౌతమి. ఆమె కృశాగౌతమి!